సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 26 । జూలై । 2023



## పురోగతి శూన్యం

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో పురోగతి లేదని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు కాశీరావు అన్నారు. 8లో▸



## చేవెళ్ల నా ఇల్లు

చేవెళ్ల ప్రాంతం నా కుటుంబం.. ఇక్కడి ప్రజలు నా కుటుంబ సభ్యులు అని మంత్రి సబితారెడ్డి అన్నారు. 8లో▸



## పల్లెల అభివృద్ధికి చర్యలు

పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. 8లో▸

## న్యూస్‌రీల్

### చంద్రయాన్–3 అలంకరణలో సుందరేశ్వరస్వామి



మొయినాబాద్: చంద్రయాన్–3 విజయవంతమైన సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రాంగణంలోని శివాలయంలో సుందరేశ్వరస్వామి చంద్రయాన్–3 అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం రాత్రి ఆలయ అర్చకులు సురేష్ స్వామివారికి చంద్రయాన్–3 రాకెట్ అలంకరణ చేశారు. స్వామి వారికి భక్తులు విశేషపూజలు చేశారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు



చిలుకూరు సబ్‌సెంటర్ భవనాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

మొయినాబాద్: వర్షాలు భారీగా కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు వైద్య సిబ్బందికి సూచించారు. మొయినాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చిలుకూరు సబ్‌సెంటర్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి సిబ్బంది హాజరు, అందుబాటులో ఉన్న మందుల వివరాలు తెలుసుకున్నారు. చిలుకూరులో నూతనంగా నిర్మించిన సబ్‌సెంటర్ భవనంలో మిగిలిపోయిన పనులు వెంటనే పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. భవనం ముందు ఉన్న చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, గడ్డి తొలగించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని.. పీహెచ్‌సీ, సబ్‌సెంటర్లలో వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలన్నారు.

### వరదనీటి సమస్య పరిష్కారానికి కృషి

మంత్రి సబితారెడ్డి



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపల్ పరిధి నబీల్ కాలనీలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదతో కాలనీలో నీరు చేరిన ప్రాంతాన్ని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి మంగళవారం పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషన్, అధికారులతో కలిసి ఆమె ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. వరదనీటి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రూ.3.25 కోట్లతో చేపడుతున్న నాలా పనులు పూర్తయితే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అప్పటివరకు తాత్కాలిక పనులు చేపట్టి నీరు వెళ్లేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

### ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

అబ్దుల్లాపూర్‌మెట్: ఓ ప్రేమ జంట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం సాయంత్రం ఓ యువతీయువకుడు సంఘీనగర్‌లోని నిర్మానుష్య ప్రదేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నిస్తుండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్ రామంతాపూర్‌కు చెందిన ప్రేమ జంటగా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని, కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

### అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. వివరాలకు 94905 22423 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

# సరికొత్త ఒర‘బడి’



డిజిటల్ తెరపై పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

**బ్లాక్‌బోర్డులు.. చాక్‌పీసులకు స్వస్తి !**

- ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన
- కళ్లెదుటే కదలాడే చిత్రాలతో పాఠాలు
- జిల్లాలోని 131 పాఠశాలల్లో శ్రీకారం
- ఆసక్తి చూపిస్తున్న విద్యార్థులు

కొత్తూరు: దశాబ్దాలుగా బ్లాక్‌బోర్డులు.. చాక్‌పీసులతో కూడిన చదువులకు ముగింపు పలుకుతూ సర్కారు బడులు సరికొత్త దిశగా ముందుకు దూసుకెళ్తున్నాయి. క్షేత్రస్థాయి నుంచి పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ‘మనఊరు–మనబడి’ ద్వారా శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ విద్యాసంవత్సరం నుంచి ఆయా పాఠశాలల్లో ప్రారంభమైన డిజిటల్ విద్యాబోధన విద్యార్థుల్లో ఆసక్తిని పెంచుతోంది. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో కొత్త విధానంలో పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయులు సైతం ఉత్సాహం చూపుతున్నారు.

**జిల్లాలో ఇలా..**

జిల్లాలో ప్రస్తుతం 248 జెడ్పీహెచ్‌ఎస్, 181 ప్రాథమికోన్నత, 881 ప్రాథమిక, 20 కేజీబీవీ పాఠశాలలు కొనసాగుతున్నాయి. మనఊరు–మనబడిలో భాగంగా డిజిటల్ బోధన కోసం వీటిలో 147 పాఠశాలలను ఎంపిక చేయగా 131 పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ)ను అమర్చారు. మిగిలిన 16 పాఠశాలల్లో త్వరలో అమర్చనున్నారు.

**తెరపై బోధనతో ఉపయోగాలు..**

- ఇంతకు ముందు ఉపాధ్యాయులు తరగతి గదుల్లో పుస్తకాలతో చేసే పాఠ్యాంశాల బోధనను కొందరు విద్యార్థులు పూర్తిగా అర్థం చేసుకోలేకపోయేవారు.
- ప్రస్తుతం ఐఎఫ్‌పీల ద్వారా దృశ్యరూపంలో బోధన కొనసాగుతుండడంతో చదువులో వెనకబడిన విద్యార్థులు సైతం పాఠాలను సులువుగా అర్థం చేసుకుంటున్నారు.
- దృశ్య, వీక్షణ ద్వారా పాఠాల బోధన సాగుతుండడంతో విద్యార్థులకు పాఠ్యాంశాలపై విషయ పరిజ్ఞానం పెరుగుతుంది.
- మొదటి దశలో జిల్లా వ్యాప్తంగా 8,9, పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ బోధన ప్రక్రియ కొనసాగుతోంది.
- ఇలాంటి కొత్త ప్రయోగాత్మక బోధన ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో రానున్న రోజుల్లో మరిన్ని అడ్మిషన్లు పెరిగేందుకు అవకాశం ఉంది.

**కరెంట్ నిలిచిపోయినా..**

డిజిటల్ బోధనకు ఎంపికైన ప్రతి పాఠశాలకు విద్యాశాఖ అధికారులు ఐఎఫ్‌పీలను అందజేశారు. ఎనిమిది నుంచి పదో తరగతులకు ప్రతి తరగతికి ఒకటి చొప్పున ఐఎఫ్‌పీలను సమకూర్చారు. విద్యార్థులకు ఉపయోగపడేలా బోధన ప్రక్రియపై ఉపాధ్యాయులకు ఇప్పటికే విద్యాశాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. డిజిటల్ తెరపై పాఠాలు బోధిస్తున్న సమయంలో కరెంట్ సరఫరా నిలిచినా సుమారు మూడు గంటలపాటు బోధించేలా బ్యాకప్ కోసం యూపీఎస్‌లను సమకూర్చారు.

**శ్రద్ధగా వింటున్నాం**



తరగతి గదుల్లో ఇంతకు ముందులా కాకుండా తెరపై బొమ్మలు చూపిస్తూ పాఠాలు బోధిస్తున్నారు. ఈ బోధన చాలా ఆసక్తిగా ఉంది. పాఠ్యాంశాలు సులువుగా అర్థమవుతున్నాయి. శ్రద్ధగా వింటున్నాం.
– అభిషేక్, పదోతరగతి, కొత్తూరు జెడ్పీహెచ్‌ఎస్

**ఆసక్తి పెరిగింది**



డిజిటల్ తెరపై పాఠాల బోధనతో పాఠ్యాంశాల్లోని ప్రయోగాలు, బొమ్మలను నేరుగా చూసినట్లుంది. ఈ పద్ధతిలో బోధనతో చదువుపై మరింత ఆసక్తి పెరిగింది.
– తాహెరా, పదో తరగతి, కొత్తూరు, జెడ్పీహెచ్‌ఎస్

**విషయపరిజ్ఞానం పెరుగుతుంది**



పుస్తకాలతో కాకుండా తెరపై దృశ్య, వీక్షణ ద్వారా పాఠాలు బోధించడం ద్వారా విద్యార్థుల్లో పాఠ్యాంశాలపై విషయ పరిజ్ఞానం పెరుగుతుంది. చాలామంది విద్యార్థులకు పుస్తకాలతో బోధిస్తే పూర్తిగా అర్థం చేసుకోవడానికి సమయం పడుతుంది. త్వరగా మర్చిపోయే వీలుంది. డిజిటల్ బోధన ద్వారా అర్థం చేసుకున్న పాఠాలను అంత త్వరగా మర్చిపోయే అవకాశం లేదు.
– భాగ్యమ్మ, హెచ్‌ఎం, కొత్తూరు

# మాసబ్ చెరువుకు జలకళ

- వరుసగా నాలుగో ఏడాది అలుగు
- భారీ వర్షాల నేపథ్యంలో మరింత పెరగనున్న ఉధృతి

తుర్కయంజాల్: స్థానిక మాసబ్ చెరువు 50 ఏళ్ల చరిత్రలో వరుసగా నాలుగో ఏడాది అలుగు పారుతోంది. ఇప్పటికే నిండు కుండలా ఉన్న చెరువు సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వరద ప్రవాహం పెరగడంతో అర్ధరాత్రి నుంచి అలుగు పారడం ప్రారంభమైంది. మరో రెండు, మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ ప్రకటించడంతో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉంది.

**రోడ్డుపైనే పారుతున్న నీరు..**

మాసబ్ చెరువు నుంచి దిలావర్‌ఖాన్ చెరువుకు వెళ్లే నీరు ఇంజాపూర్ నుంచి తొర్రూర్‌కు వెళ్లే దారిలో ప్రవహిస్తోంది. 2020 అక్టోబర్ 12న కురిసిన భారీ వర్షానికి వరద ఉధృతి అధికం కావడంతో ఇద్దరు యువకులు ఇదే ప్రాంతంలో కొట్టుకుపోయి మృతి చెందిన విషయం తెలిసిందే. అయినా ఈ సంఘటన నుంచి గుణపాఠం నేర్చుకోని అధికారులు ఇక్కడ ఎలాంటి రక్షణ చర్యలు కానీ, హెచ్చరిక బోర్డులను గానీ ఏర్పాటు చేయలేదు. సోమవారం సాయంత్రం కురిసిన 4 సెంటీమీటర్ల వర్షానికి వరద ప్రవాహం పెరిగినా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు.

**ముంపు బారిన కాలనీలు**

మాసబ్ చెరువు అలుగు పారడంతో ఇంజాపూర్‌లోని అపిల్ అవెన్యూ కాలనీ ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద నాలా నిర్మాణం చేపడతామని అధికారులు ప్రకటించినా ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. చెరువు ఏటా కొన్ని రోజుల పాటు అలుగు పారుతుండటంతో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులకు జాప్యం జరుగుతోంది. సుమారు రూ.100 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ ఇళ్లను అసెంబ్లీ ఎన్నికలకు ముందే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నా కుదిరే పరిస్థితి కనిపించడం లేదు.



అలుగు పారుతున్న మాసబ్ చెరువు

# పల్లెలను హరిత వనాలుగా మార్చాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఉపాధిహామీ అడిషనల్ డీఆర్డీఓ నీరజ

షాద్‌నగర్‌రూరల్: ప్రతిఒక్కరూ మొక్కలను నాటి పల్లెలను హరిత వనాలుగా తీర్చిదిద్దాలని ఉపాధి హామీ అడిషనల్ డీఆర్డీఓ నీరజ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ గ్రామీణ నర్సరీ, క్రీడా ప్రాంగణాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. నర్సరీలో ఎన్ని రకాల మొక్కలు ఉన్నాయి, ప్రభుత్వ లక్ష్యానికి సరిపడా ఉన్నాయా, గ్రామీణ క్రీడాప్రాంగణం నిర్వహణ ఏ విధంగా ఉంది అనే విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటిన మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి ఆవరణతో పాటు వ్యవసాయ పొలాలల్లో మొక్కలు నాటి హరిత లక్ష్యానికి తమవంతు తోడ్పాటును అందించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, మొక్కలను నాటేందుకు గుంతలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నాటేందుకు పండ్ల మొక్కలను అందజేయాలని, రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కలను నాటాలని సూచించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందని అన్నారు. పల్లెల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణయ్య, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఏపీఓ అరుణ, పంచాయితీ కార్యదర్శి తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలకు ఊతం

- రాయితీలతో కూడిన ప్రోత్సాహకాలు
- నీటి వసతి కలిగి ఐదెకరాల్లోపు భూమి ఉన్న వారికి అవకాశం
- ఉపాధి హామీ జాబ్‌కార్డు తప్పనిసరి
- ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులంతా అర్హులే..

షాబాద్: ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు పెద్దపీట వేసింది. కూరగాయలు, పండ్లు, ఇతర ఉద్యాన పంటలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాయితీలతో కూడిన ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఉపాధి హామీ పథకంలో పనిచేసే చిన్న, సన్నకారు రైతులకు మేలు జరిగేలా నిర్ణయాన్ని వెలువరించింది. జాబ్ కార్డు ఉండి ఐదెకరాల్లో భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు ఈ పథకంలో అవకాశం కల్పిస్తారు. నీటి వనరులు ఉన్న రైతులు వరిసాగు చేస్తుండడంతో ఏటా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. దీంతో వరికి ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయాన్ని ఇచ్చే పండ్లు, ఉద్యాన పంటలను ప్రోత్సహించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీలు ప్రకటించింది.

**జిల్లాలో 2,055 ఎకరాలు**

జిల్లాలో 2,055 ఎకరాల్లో ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది ఉద్యాన పంటల సాగుకు ప్రణాళిక రూపొందించారు. నేలల రకాలు, వనరులను పరిగణలోకి తీసుకొని అవకాశం కల్పిస్తారు. ఈ మేరకు మామిడి, జామ, సపోటా, దానిమ్మ, సీతాఫలం, మునగ, డ్రాగన్‌ఫ్రూట్ తో పాటు ఇతర పండ్లను సాగు చేయించాలనేది అధికారుల లక్ష్యం. కూలీల ఖర్చు, మెటీరియల్, డ్రిప్ పరికరాలపై రాయితీని అన్ని పంటలకు ఎకరం చొప్పున పరిగణనలోకి తీసుకోనుండగా, డ్రాగన్ ఫ్రూట్‌కు మాత్రం అర ఎకరాన్ని పరిగణనలోకి తీసుకుంటారు.



డ్రాగన్ ఫ్రూట్ పండ్ల తోట

**మూడేళ్ల పాటు సంరక్షణ బాధ్యత**

పండ్ల తోటల సంరక్షణ బాధ్యతను మూడేళ్ల పాటు ప్రభుత్వమే చూస్తుంది. మొక్కలు, ఎరువుల కొనుగోలు, నిర్వహణ, గుంతలు తీయటం, మొక్కలు నాటడం వంటి పనులకయ్యే ఖర్చు మూడేళ్ల పాటు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లిస్తుంది. మామిడి ఒక్కో మొక్కకు రూ.30, బత్తాయికి రూ.44 ఇలా అన్ని మొక్కలను చెల్లించడమే కాక ఎరువు కోసం ఒక్కో మొక్కకు రూ.50, నిర్వహణ ఖర్చునెలకు రూ.10 చొప్పున చెల్లిస్తారు. గుంతలు తీయడం, మొక్కలు నాటడం వంటి పనులన్నీ ఉపాధి హామీ కూలీలతో చేయించాల్సి ఉంటుంది. ఇవేకాక బిందు సేద్యం పరికరాలను కూడా రాయితీపై అందజేస్తారు. ఐదెకరాలలోపు భూమి కలిగి ఉండి, ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన రైతులను బిందు సేద్యం పథకంలో రాయితీకి అర్హులుగా నిర్ణయించారు. సాగునీటి వసతి కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాల పంపిణీ చేయనున్నారు.

**రైతులు వినియోగించుకోవాలి**



ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు ఉద్యానపంటల సాగును సద్వినియోగం చేసుకోవాలి. అన్ని పత్రాలతో ఉద్యాన అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలి. ఈ పథకంపై జిల్లా వ్యాప్తంగా రైతుల్లో అవగాహన కల్పించనున్నాం.
– సునందారాణి, జిల్లా ఉద్యానశాఖ, పట్టు పరిశ్రమ అధికారి

# మణిపూర్ మారణకాండపై ఫైర్

- అల్లర్లకు ప్రధాని బాధ్యత వహించాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి

హయత్‌నగర్: మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లకు ప్రధాని మోదీ బాధ్యత వహించి రాజీనామా చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. మణిపూర్ సంఘటనలను నిరసిస్తూ మంగళవారం హయత్‌నగర్‌లోని జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... దేశంలో మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. సుందర ప్రదేశం అయిన మణిపూర్‌లో ఒక తెగ ప్రజలపై అఘాయిత్యాలు జరుగుతున్నా అవి బయటికి రాకుండా ప్రభుత్వం దాచిపెట్టిందని ఆరోపించారు. మూడు నెలల క్రితం జరిగిన అమానుష సంఘటనపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. మణిపూర్‌లో రావణ కాష్టంపై దేశం అట్టుడుకిపోతున్నా ప్రధాని పార్లమెంట్‌లో నోరు మెదపకపోవడం దారుణమని దుయ్యబట్టారు. పార్టీ హయత్‌నగర్ మండల కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్ లక్ష్మణ్, నాయకులు హరిసింగ్‌నాయక్, వేణుగోపాల్, సక్రూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



హయత్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

### వివాదాస్పద భూమికి రహస్యంగా రిజిస్ట్రేషన్ ?

కొత్తూరు: మండల పరిధిలోని పెంజర్లలో వివాదాస్పద భూమికి అధికారులు రహస్యంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సర్వే నంబర్ 255లో 52 ఎకరాల భూమి ఉండగా గతంలో ప్రభుత్వం సుమారు 27 మందికి అసైన్డ్ చేసింది. రెవెన్యూ రికార్డుల్లో ఓ చోట ప్రభుత్వ భూమిగా(అసైన్డ్) మరోచోట పట్టా భూమిగా నమోదయ్యాయి. దీనిని అసరాగా చేసుకున్న కొందరు రియల్ వ్యాపారులు రైతుల నుంచి తక్కువకు పొలాలను కొనుగోలు చేస్తున్నారని ఇది వరకే గ్రామస్తులు రెవెన్యూ అధికారుల దృష్టికి తేవడంతో పాటు ఆందోళనలు చేపట్టారు. తాజాగా ఇదే భూమిని కొందరు రియల్ వ్యాపారులు కొనుగోలు చేయడానికి వివరాలు మార్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం స్లాట్ బుకింగ్ చేసుకున్నట్లు తెలుసుకున్న గ్రామస్తులు మరోసారి కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డిని వివరణ కోరగా రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుకింగ్ అయిన మాట వాస్తవమన్నారు. గ్రామస్తుల అభ్యంతరంతో రిజిస్ట్రేషన్లు చేయలేదన్నారు.

# మణిపూర్ ఘటనలు బాధాకరం




కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: మణిపూర్‌లో చోటు చేసుకుంటున్న సంఘటనలు దేశం తలదించుకునేలా ఉన్నాయని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మణిపూర్, జోధ్‌పూర్‌లో జరిగిన హత్యాచార ఘటనలకు నిరసనగా ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మీర్‌పేట చంద్రా గార్డెన్స్ నుంచి మందమల్లమ్మ చౌరస్తా వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మణిపూర్‌లో మతోన్మాద శక్తులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ మానవత్వాన్ని మంటగలుపుతున్నాయని, ఇంత జరుగుతున్నా ప్రధాని మోదీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రజలకు భద్రత లేకుండా పోయిందని, రానున్న రోజుల్లో ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చిగురింత పారిజాత, కొత్త మనోహర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, బంగారు బాబు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, దీక్షిత్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై పురోగతి శూన్యం

- టీపీయూఎస్ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ సిద్ధం
- సంఘం జిల్లా అధ్యక్షుడు కాశీరావు



వినతిపత్రం అందజేస్తున్న టీపీయూఎస్ సంఘం నాయకులు

**కడ్తాల్:** ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి పురోగతి లేక ఉపాధ్యాయులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) జిల్లా అధ్యక్షుడు కాశీరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో నిరసన చేపట్టి ఇన్‌చార్జి తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశబూరు. ఈ సందర్భంగా కాశీరావు మాట్లాడుతూ.. పీఆర్సీ కమిటీ వేసి వెంటనే మధ్యంతర భృతి (ఐఆర్)ని ప్రకటించాలని, పెండింగ్ డీఏలను ప్రకటించాలని, ఏరియర్స్‌ను ఏకకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. స్థానికతను కోల్పోయిన ఉద్యోగులకు సొంత జిల్లాలకు వెళ్లేందుకు అవకాశం కల్పించాలని, అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు, జూనియర్ లెక్చరర్, డైట్ లెక్చరర్ ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. పండింట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్ అమలు చేయడంతో పాటు, ఈహెచ్‌ఎస్ కార్డులకు అన్ని ఆసుపత్రులలో పరిమితి లేని చికిత్సను అందిచేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలో స్కావెంజర్లను పునరుద్ధరించాలని, నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని, 398 వేతనంపై పనిచేసిన ఉపాధ్యాయులను నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. కేజీబీవీ, మాడల్ స్కూల్, గిరిజన సంక్షేమ శాఖ, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలోని ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. సమస్యలను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు కార్యచరణ రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ప్రసాద్‌రావు, సుమ రంజిత ఉన్నారు.

**పెండింగ్ బిల్స్ చెల్లించకుంటే ఆందోళన**

**మంచాల:** ప్రభుత్వం జూలై 31వరకు ఉపాధ్యాయుల పెండింగ్ బిల్స్ చెల్లిస్తామని హామీ ఇచ్చిందని.. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.గోవర్ధన్‌యాదవ్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని జాపాల, రంగాపూర్, లోయపల్లి, ఆగాపల్లి, చీదేడ్, మంచాల ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్స్‌కు బదులుగా రేషన్‌లైజేషన్ చేపట్టాలన్నారు. పీఆర్సీ కమిషన్ వేసి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మధ్యంతర వృత్తిని ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి సీతారాం నాయక్, గౌరవ అధ్యక్షుడు జమీర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిందం వెంకటయ్య, వివిధ గ్రామాల పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ‘పరిశ్రమ పేలుడు’ ఘటనలో మరో కార్మికుడి మృతి

నాలుగుకు చేరిన మృతుల సంఖ్య

**షాద్‌నగర్‌రూరల్:** పరిశ్రమ పేలుడు ఘటనలో చికిత్స పొందుతున్న వారిలో మంగళవారం మరొక కార్మికుడు మృతి చెందాడు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ శివారులోగల బ్లైండ్ కలర్(ప్యాకేజీ కవర్ల పరిశ్రమ)లో ఈ నెల 16న రాత్రి భారీ పేలుడు సంభవించిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న 11 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం నగరంలోని డీఆర్‌డీఓ అపోలో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో మనోజీత్‌దాస్(29) మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## వ్యక్తి బలవన్మరణం

**నందిగామ:** మద్యానికి బానిసగా మారిన ఓ వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నందిగామలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సురేశ్ తెలిపిన ప్రకారం.. నగరంలోని నేరేడ్‌మెట్ ప్రాంతానికి చెందిన రాకేష్(43) తన భార్య స్వప్న ఇద్దరు పిల్లలతో కలిసి 12 ఏళ్ల క్రితం నందిగామకు వలస వచ్చాడు. ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటూ కూలీ పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల రాకేశ్ మద్యానికి బానిసగా మారి కూలీకి వెళ్లడం మానేశాడు. కాగా మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో సుమారు 7గంటల ప్రాంతంలో ఇంట్లోని రేకులకు బిగించిన పైపునకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన భార్య గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సురేశ్ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

## బాలుడిపై వీధికుక్కల దాడి

**నందిగామ:** వీధి కుక్కలు గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. మండల పరిధిలోని ధన్‌సింగ్ తండాకు చెందిన ఉదయ్ నాయక్ అనే బాలుడు మంగళవారం పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా వీధి కుక్కలు వెంటబడ్డాయి. భయంతో పరిగెత్తుతున్న బాలుడిని చేతిని కరవడంతో తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన తండా వాసులు బాలుడిని వెంటనే షాద్‌నగడ్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా తండా వాసులు మాట్లాడుతూ.. నగరంలోని వీధి కుక్కలను అర్ధరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా వదిలి వెళ్తున్నారని ఆరోపించారు. దీంతో మనుషులు, మూగజీవాలపై దాడులు తీవ్రమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కలను తరిమేయాలని కోరుతున్నారు.

# చేవెళ్ల నా ఇల్లు

## ప్రజలు నా కుటుంబ సభ్యులు

- మంత్రి సబితారెడ్డి
- రామన్నగూడలో పర్మయ్య విగ్రహావిష్కరణ



చేవెళ్ల: రామన్నగూడలో పర్మయ్య విగ్రహావిష్కరణ చేస్తున్న సబితారెడ్డి, యాదయ్య, రత్నం తదితరులు

**చేవెళ్ల:** చేవెళ్ల ప్రాంతం నా కుటుంబం.. ఇక్కడి ప్రజలు నా కుటుంబ సభ్యులని మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని రామన్నగూడలో మంగళవారం దివంగత జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పర్మయ్య విగ్రహావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ.. పర్మయ్య సేవలను కొనియాడారు. ఇంద్రారెడ్డి వెంట వెంటూ నిస్వార్థ సేవకుడిగా అందరి మనస్సుల్లో స్థానం సంపాదించుకున్నాడన్నారు. ఇంద్రారెడ్డి హయాం నుంచి నేటి వరకు తమ కుటుంబానికి రాజకీయంగా అండగా ఉంటున్న ఈ ప్రాంతవాసులపై ప్రత్యేక అభిమానం ఉంటుందన్నారు. చేవెళ్లకు ఉన్న అనుబంధంతోనే చేవెళ్ల చెల్లమ్మగా తనకు గుర్తింపు వచ్చి చేవెళ్ల ఇంటి పేరుగా మారిపోయిందని గుర్తు చేశారు. రామన్నగూడ యువత, విద్యార్థులకోసం లైబ్రరీని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తండ్రి సేవలను గుర్తుచేసేలా కొడుకు దయాకర్, కుటుంబసభ్యులు పర్మయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయన పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు కొనసాగించేందుకు సిద్ధమవ్వడం అభినందనీయమన్నారు. ఈ ట్రస్ట్ నుంచి గ్రామంలోని మహిళ వివాహానికి రూ.25వేలు, మృతుల కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందిచేందుకు నిర్ణయించినట్లు ప్రకటించారు. అనంతరం మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య మహిళలకు చీరలు అందజేశారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.బాల్‌రాజ్, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, సీనియర్ నాయకులు జనార్దన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శివానందం రమణారెడ్డి తదితరులు పర్మయ్యతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.మాలతి. వైస్ ఎంపీపీ శివప్రసాద్, సర్పంచ్ లవాణ్య, పి.ప్రభాకర్, దశరథ, మహేందర్, చేవెళ్ల సర్పంచ్ శైలజ, కాంగ్రెస్, బీజేపీ నాయకులు వసంతం, వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాములు, వీరేందర్ రెడ్డి, అనంత్‌రెడ్డి, ప్రవీణ్, అభిలాష్, గ్రామస్తులు, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమిపూజ**

మండల పరిధిలోని రామన్నగూడ, న్యాలట, సింగప్పగూడ గ్రామాల ప్రజలకు ఎంపీపీ ఎం.విజయలక్ష్మీరెడ్డి రూ.20లక్షల తన సొంత డబ్బుతో మినీ పంక్షన్‌హాల్ నిర్మాణానికి మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో భూమి పూజ చేయించారు. ఈ సందర్భంగా తన ఎంపీటీసీ పరిధిలోని గ్రామాల ప్రజలకోసం ఈనిర్ణయం తీసుకుంటున్నట్లు ఎంపీపీ ప్రకటించారు. వారి నిర్ణయాన్ని మంత్రి, ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. విజయలక్ష్మిని ఎంపీటీసీ సభ్యురాలిగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునేందుకు తన తల్లిదండ్రుల పేరిట ఈ మినీ ఫంక్షన్ హాల్‌ను నిర్మించి గ్రామస్తులకు అప్పగిస్తానని ఆమె భర్త రమణారెడ్డి తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి అందులో అందరికి ఉపయోగపడేలా ఈ మినీ ఫంక్షన్‌హాల్ నిర్మించి అందిస్తానన్నారు.

## గౌడసంఘం భవన నిర్మాణానికి రూ.25 లక్షలు

**మహేశ్వరం:** గౌడ కులస్తుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో గౌడ సంఘం నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సంఘం అధ్యక్షుడు బస్వ యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు మంగళవారం మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన ఆమె ప్రభుత్వం నుంచి రూ.25 లక్షల నిధులను మంజూరు చేస్తున్నామని చెప్పి ఉన్నతాధికారులకు ప్రొసీడింగ్స్ తయారు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమీర్‌పేట్ గ్రామంలో గౌడ కులస్తులు తాటి, ఈత, ఖర్జూర చెట్లు పెంచుకోవడానికి ప్రభుత్వం నుంచి కోట్ల ధర పలికే 4 ఎకరాల భూమి కేటాయించామన్నారు. గీట కార్మికుల సంక్షేమానికి ఆసరా పింఛన్, ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి కింద పడి మరణించిన కార్మికుడికి రూ.5 లక్షల పరిహారం అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అమీర్‌పేట్ అధ్యక్షుడు బస్వ యాదయ్యగౌడ్, సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్, ఉప సర్పంచ్ పోతుల నర్సింగ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పెంటల కుమారి రాయప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కె.దేవవరంగౌడ్, గౌడ సంఘం నాయకులు మన్నాన్‌పల్లి వెంకటేశ్ గౌడ్, అశోక్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, అంజయ్య గౌడ్, మచ్చేందర్ గౌడ్, భీమయ్య గౌడ్, రమేశ్ గౌడ్, దర్శన్ గౌడ్, ఐశ్వర్య గౌడ్, కన్నెగౌడ్, వెంకటయ్య గౌడ్, సత్తయ్య గౌడ్, వంశీగౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు చేయూతనివ్వండి

టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్



గోపిచంద్‌తో లక్ష్మీనివాస్

**తలకొండపల్లి:** బాడ్మింటన్‌తో పాటు.. ఇతర క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారులకు చేయూత నివ్వాలని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ బాడ్మింటన్ ఇండియన్ నేషనల్ కోచ్ పుల్లెల గోపిచంద్‌ను కోరారు. మండల పరిధిలోని లింగరావుపల్లికి చెందిన లక్ష్మీనివాస్ మంగళవారం హైదరాబాద్‌లో గోపిచంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పలు క్రీడా అంశాలపై ఆయనతో చర్చించారు. గోపిచంద్ మాట్లాడుతూ.. కఠినమైన శిక్షణతో సమర్థవంతమైన క్రీడాకారులను తయారు చేయవచ్చునన్నారు. క్రీడలను రాజకీయాలకు దూరంగా ఉంచాలన్నారు.

## దేవాలయంలో చోరీ

**అత్తాపూర్:** దేవాలయంలో హుండీ బద్దలు కొట్టి నగదు ఎత్తుకెళ్లిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ నల్లపోచమ్మ ఆలయంలో స్థానికుడు మేకల రాంరెడ్డి ఆలయం గేట్లకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి దేవాలయంలోకి చొరబడి హుండీని బద్దలు కొట్టి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లాడు. తెల్లవారుజామున దేవాలయానికి వచ్చిన స్థానికులు చూసి అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు దేవాలయానికి వచ్చి హుండి బద్దలు కొట్టిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

## ఉమ్రా బయలుదేరిన యాత్రికులు

**శంషాబాద్:** పవిత్ర ఉమ్రా యాత్రకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన వంద మంది యాత్రికులు మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరారు. యాత్రికులకు వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అల్‌మిజాన్ సంస్థ పర్యవేక్షించనున్నట్లు సంస్థ ఎండీ ఫయాజ్ అలీ తెలిపారు.

# పల్లెల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

- షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- రూ.30లక్షల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**షాద్‌నగర్:** పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన రూ.15లక్షలతో నిర్మిస్తున్న కుందేలుకుంట పంచాయతీ భవన నిర్మాణానికి, చింతగూడలో రూ.15లక్షలతో నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులకు 69 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఈకార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, వైస్ ఎంపీపీ మౌనిక, లక్ష్మీ, లక్ష్మణ్ నాయక్, బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో పలువురి చేరిక**

మండల పరిధిలోని గంట్లవెల్లి గ్రామానికి చెందిన బీజేపీ, బీఎస్పీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీజేపీకి చెందిన అఖిల్, అశోక్ యాదవ్, నందీశ్వర్, శివకుమార్, విశాల్‌గౌడ్, వినోద్‌కుమార్, ప్రవీణ్, రాఘవేందర్, ఆనంద్, హరికృష్ణ, రఘు, బీఎస్పీకి చెందిన శివకుమార్, బాల్‌రాజ్, శ్రీనివాస్, మిద్దె నర్సింలు, వీరేందర్, శ్రీశైలం, ప్రశాంత్, రవి, యాదయ్య, గణేశ్, రమేశ్, రఘునాథ్, ప్రేమ్‌రాజ్, వెంకటయ్య, కృష్ణలు ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ గూటికి చేరారు.

# ఆ నిధులను ఎస్ఎన్‌డీపీకి కేటాయించండి

కలెక్టర్‌కు విన్నవించిన మేయర్ పారిజాత




కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మేయర్ పారిజాత

**బడంగ్‌పేట్:** దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సీఎం కేసీఆర్ బడంగ్‌పేట కార్పొరేషన్‌కు ప్రకటించిన రూ.50 కోట్లను ఎస్ఎన్‌డీపీ నిర్మాణ పనులకు కేటాయించాలని కలెక్టర్ హరీశ్‌కు మేయర్ పారిజాత విన్నవించారు. ఈ మేరకు ఆమె కార్పొరేటర్లతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. గతంలో కురిసిన వర్షాలకు కాలనీలకు వరద ముంపునకు గురవ్వగా ఎస్ఎన్‌డీపీ పనులు ప్రారంభించామన్నారు. అందుకు మున్సిపల్ కార్పొరేషన్ నిధులు సుమారు రూ.7కోట్లకు పైగా వెచ్చించామన్నారు. రూ.64కోట్లతో ఎస్ఎన్‌డీపీ ప్రణాళికను ఏర్పాటు చేశారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌కు రూ.57కోట్లు నిధులు అవసరం ఉందన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.50 కోట్లను ఎస్ఎన్‌డీపీ పనులకు కేటాయించేలా నిర్ణయం తీసుకుని పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్పొరేటర్లు పి.సుదర్శన్‌రెడ్డి, బాలునాయక్, మనోహర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రియుడితో గొడవపడి వాగులో దూకిన మహిళ

గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు



నిర్మలమ్మ(ఫైల్)



వాగువద్ద గాలింపు చర్యలు పర్యవేక్షిస్తున్న ఎస్ఐ దేవకి

**షాద్‌నగర్‌రూరల్:** ప్రియుడితో గొడవపడిన మహిళ వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ దేవకి తెలిపిన ప్రకారం.. కొందుర్గు మండలం ఆగిర్యాలకు చెందిన గుమ్మడి నిర్మలమ్మ(36), ఎల్లయ్య దంపతులకు ఒక బాలిక సంతానం. నిర్మలమ్మ కొన్నేళ్లుగా భర్తకు దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో తొమ్మిదేళ్లుగా తలకొండపల్లికి చెందిన రవీందర్‌తో సహజీవనం చేస్తోంది. రవీందర్ ఈ నెల 24న అయ్యవారిపల్లిలోని స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో నిర్మలమ్మ రవీందర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకుంది. మంగళవారం ఉదయం అయ్యవారిపల్లికి వెళ్లి రవీందర్‌తో గొడవ పడింది. నన్ను పట్టించుకోవడం లేదు.. నేను చనిపోతాను అంటూ గ్రామ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో దూకింది. గమనించిన స్థానికులు ఆమెను కాపాడేందుకు యత్నించినా వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. సమాచారం అందుకున్న పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, ఎస్ఐ దేవకి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. బాధితురాలి తల్లి సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దేవకి తెలిపారు.